సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం ၊ 9 ၊ సెప్టెంబర్ ၊ 2025



రేషన్ డీలర్ల ఎదురుచూపులు

రేషన్ డీలర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదు నెలలుగా కమీషన్ అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 8లో



భూ వివాదంలో ఘర్షణ

మణుగూరు మండలం మల్లంపాడులో భూ వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీయగా పలువురు గాయపడ్డారు. 8లో


గరిష్టం / కనిష్టం

32° / 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల మధ్యాహ్నం తర్వాత ఆకాశం మేఘావృతమవుతుంది.

కేంద్రం దయ.. మన ప్రాప్తం





గతేడాది వరదలపై సర్వేతోనే సరి

- అన్నదాతలకు చిల్లిగవ్వా అందని సాయం
- ధనధాన్య యోజనలో జిల్లాకు రిక్తహస్తం
- 'గూడెం'లో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుపైనా అదే తీరు..
- సరిపడా ఎరువుల సరఫరా లేక ఇక్కట్లు





సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో కేంద్రం చేయూతతో జరగాల్సిన పనుల్లో ముందడుగు పడడం లేదు. గత ఏడాది భారీ వరదలతో ఉమ్మడి జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. రూ.వందల కోట్ల మేర రైతులు నష్టపోయి ఏడాది దాటినా సర్వేతోనే సరిపెట్టారు తప్ప రూపాయి సాయం కూడా విదిల్చలేదు. అలాగే కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు, క్రూడ్ పామాయిల్‌పై సుంకాల తగ్గింపు, ధన ధాన్య యోజనలో భద్రాద్రి జిల్లాకు స్థానం, రఘునాథపాలెం మండలంలో ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటుకు నిధులు, సరిపడా యూరియా కేటాయింపులోనూ రిక్తహస్తమే ఎదురవుతోంది. ఈ అంశాలపై ఇటీవల ఢిల్లీ పర్యటనలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రులను కలిసి వినతిపత్రాలు అందజేశారు.

యూరియా మంటలు

కేంద్రం నుంచి తగిన రీతిలో యూరియా సరఫరా కాక కొరత ఏర్పడింది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ చూసినా పంపిణీ కేంద్రాల వద్ద బారులు దీరిన రైతులే కనిపిస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో 54,825 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే 27,865 మెట్రిక్ టన్నులు పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులోనూ 22,653 మెట్రిక్ టన్నులే చేరింది. సెప్టెంబర్‌కు సంబంధించి 5,212 మెట్రిక్ టన్నుల కోటా రావాలి. భద్రాద్రి జిల్లాకు ఈ నెలలో 10,014 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా 2,600 మెట్రిక్ టన్నులు చేరడంతో కొరత ఎదురవుతోంది. ఇంకా 6,677 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. ఈ క్రమాన మంత్రి తుమ్మల ఇటీవల కేంద్ర మంత్రులను కలిసి సరిపడా యూరియా కేటాయించాలని, నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం, సల్ఫర్‌పై ఇచ్చే రాయితీలు పెంచాలని కోరారు.

ఎస్టీపీకి నిధులివ్వరూ..

రఘునాథపాలెం బ్లాక్‌లోని గిరిజన తండాల్లో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు రూ.110 కోట్ల అంచనా వ్యయంతో సిమెంట్ కాంక్రీట్ డ్రెయినేజీ నెట్‌వర్క్ కోసం డీపీఆర్(డీటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్) సిద్ధం చేశారు. వ్యర్థ జలాలను శుద్ధి చేసి మున్నేటికి వదిలేలా ప్రాజెక్టును రూపొందించారు. దీనికి ఆమోదం లభిస్తే రఘునాథపాలెం బ్లాక్ లోని 37 ఆవాసాల్లో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడనున్నందున గ్రామీణ రహదారి కనెక్టివిటీ ప్రోగ్రామ్ కింద కేంద్రం ఆమోదించాలని ప్రతిపాదించారు.

ఎయిర్‌పోర్ట్‌పై మరోసారి..

కొత్తగూడెంలో విమానాశ్రయం ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేశాక ప్రతిపాదిత ప్రాంతం ఆచరణీయం కాదని తేల్చారు. కానీ భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తులు, కొత్తగూడెంలోని పరిశ్రమలకు వచ్చివెళ్లే వారి కోసం ఇక్కడ విమానాశ్రయం ఏర్పాటు తప్పనిసరి. ప్రత్యామ్నాయ స్థలం కేటాయించి, మరోసారి అధ్యయనం చేశాకే విమానాశ్రయం ఏర్పాటుకు అడుగులు పడనున్నందున కేంద్రానికి ప్రతిపాదనలు పంపించారు.

ఆయిల్‌పామ్ రైతులకు ఎదురుదెబ్బ

ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాలకు పైగా ఆయిల్‌పామ్ సాగవుతోంది. ఈ క్రమాన కేంద్రం పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 16.5 శాతానికి తగ్గించింది. గతంలో దిగుమతి సుంకం దాదాపు 44 శాతం ఉండడంతో రైతులకు గిట్టుబాటు ధర దక్కింది. కానీ ఇప్పుడు సుంకం తగ్గించడంతో రైతులపై ప్రభావం పడనుంది. రైతులను ఆదుకునేలా కేంద్రం స్పందించి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సి ఉంది.

భద్రాద్రి జిల్లాకు అర్హత లేదా?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అన్ని రకాల పంటలు కలిపి 7లక్షల ఎకరాల్లో సాగవుతున్నాయి. ఈ జిల్లా అంతా ఏజెన్సీ, దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో వర్షాధారంగానే సాగు చేస్తారు. చెరువులు, ఇతర నీటి వనరుల ఆధారంగా వరి, తరి పంటలను సాగు చేస్తున్నారు. ఈ వానాకాలం భద్రాద్రి జిల్లాలో వరి 1,61,257.24 ఎకరాల్లో, పత్తి 2,21,344.76 ఎకరాల్లో, మొక్కజొన్న 96,842 ఎకరాల్లో, కందులు 1,881ఎకరాల్లో సాగు చేశారు. రైతులకు అండగా నిలిచేలా పంట వైవిధ్యీకరణ, నీటిపారుదల, రైతుల సమిష్టీకరణకు మద్దతు అవసరం. ఇందులో భాగంగా జిల్లాను కేంద్రం అమలుచేస్తున్న ధన ధాన్య కృషి యోజన పథకం కింద చేరిస్తే రైతుల సంక్షేమంతోపాటు స్థానికంగా జీవనోపాధి మెరుగవుతుంది. దేశవ్యాప్తంగా 100 జిల్లాల్లో ఈ పథకం అమలు చేస్తున్నందున భద్రాద్రి జిల్లానూ చేర్చాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

సర్వే సరే.. సాయమేదీ?

గత ఏడాది ఆగస్టు 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో మున్నేరు వరదతో పరీవాహక ప్రాంతాలైన ఖమ్మం నగరం, పాలేరు, మధిర నియోజకవర్గాల్లోని ప్రజలకు అపార నష్టం కలిగింది. అధికారులు చేపట్టిన సర్వేలో దాదాపు రూ.339 కోట్ల మేర నష్టం వాటిల్లిందని నిర్ధారించి కేంద్రానికి నివేదిక సమర్పించారు. ఆ తర్వాత ఢిల్లీ బృందం కూడా తమ పర్యటనలో ఇక్కడి పరిస్థితులు చూసి చలించిపోయారు. సాయం అందేలా సిఫారసు చేస్తామని బాధితులకు హామీ ఇచ్చినప్పటికీ ఏడాది దాటినా ఆ ఊసే లేదు.

పరిశోధనల దిశగా ముందుకు సాగాలి

విద్యార్థులకు కలెక్టర్ సూచన



కరకగూడెం : నవోదయలో సదుపాయాలపై చర్చిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కరకగూడెం: విద్యార్థులు పరిశోధన దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం ఆయన కరకగూడెంలోని నవోదయ విద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. వ్యక్తిగత లక్ష్య సాధనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే దిశగా చదవడం, పరిశోధనలు చేయడం ముఖ్యమని, సమాజ సమస్యలకు పరిష్కారం చూపే శాస్త్రవేత్తలుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. ఆ తర్వాత డైనింగ్ హాల్‌ను పరిశీలించి దోమలు, ఈగలు రాకుండా మెష్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. కూరగాయలు, పెరుగు వంటివి నిల్వ చేసేందుకు ఫ్రిడ్జ్ అవసరమని సిబ్బంది కోరగా వెంటనే ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంఈఓ మంజుల, ఆర్‌ఐ కృష్ణప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు నయనాదేవి, చంచల్, అనిత, స్టాఫ్ నర్స్ రాధిక పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి..

చుంచుపల్లి: త్వరలో జరగనున్న పరిషత్ ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా అన్ని పార్టీల వారు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ కోరారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఓటర్ల జాబితాలు, పోలింగ్ కేంద్రాల డ్రాఫ్ట్ జాబితాలపై అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారాల కోసం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సోమవారం ఆయన ఐడీఓసీలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్త ఓటర్ల నమోదుకు ఇప్పుడే దరఖాస్తు చేసుకోవాలని, నోటిఫికేషన్ వెలువడిన తర్వాత కొత్త పేర్లు చేర్పులు ఉండవని స్పష్టం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, డిప్యూటీ జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్, ఆయా పార్టీల నాయకులు బాల ప్రసాద్, అనుదీప్, ఎస్.శ్రీనివాస్, అన్నవరపు సత్యనారాయణ, నోముల రమేష్, రాంబాబు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

మణుగూరు రూరల్ : ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని కలెక్టర్ పాటిల్ సూచించారు. మణుగూరు ప్రభుత్వ ఐటీఐ, ఏటీసీని సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐటీఐలను ఆధునికీకరించి ఏటీసీలుగా ఏర్పాటు చేశామని, వీటిలో శిక్షణ పొందిన విద్యార్థులకు పారిశ్రామిక రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఐటీఐ సూపరింటెండెంట్ జ్యోతిరాణి, ఏటీఓలు కృష్ణారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిబిరం ప్రారంభం

అశ్వాపురం: మండలంలోని మిట్టగూడెం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో ఖమ్మం, వరంగల్, భద్రాద్రి జిల్లాల ఎన్‌సీసీ శిక్షణా శిబిరాన్ని కలెక్టర్ జితేష్ సోమవారం ప్రారంభించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంజయ్‌కుమార్ భద్ర, క్యాంప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్‌యాదవ్‌తో మాట్లాడి శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీఓ రవీంద్రప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, ఏఎన్‌ఓలు తారాచంద్, నాగులు, సిబ్బంది శేఖర్‌బాబు, ప్రశాంత్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దర్బార్ సమస్యలకు సత్వర పరిష్కారం

ఐటీడీఏ పీఓ రాహుల్



గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న రాహుల్ తదితరులు

భద్రాచలం : గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల వారు విన్నవించిన సమస్యల సత్వర పరిష్కారానికి ఆయా విభాగాల అధికారులు చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వారి సమస్యలను ఆలకించారు. అనంతరం మాట్లాడుతూ.. వినతుల సమర్పణ, సమస్యల పరిష్కారానికి ఐటీడీఏకు వచ్చే వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. అర్హులైన వారికి వెంటనే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని గిరిజనులకు సూచించారు. దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరిస్తామని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఏడీఎంహెచ్‌ఓ సైదులు, ఏఓ సున్నం రాంబాబు, ఎస్‌ఓ ఉదయభాస్కర్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ లక్ష్మీనారాయణ, ఏపీఓ వేణు, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, జేడీఎం హరికృష్ణ, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రజావాణి వెలవెల



దరఖాస్తులు స్వీకరిస్తున్న శకుంతల

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ డివిజన్ స్థాయి ప్రజావాణికి ప్రజలు స్వల్పంగా హాజరు కావడంతో వెలవెలబోయింది. ఏడుగురు మాత్రమే దరఖాస్తులు అందజేశారు. పాల్వంచ నుంచి జయమ్మ, టేకులపల్లి నుంచి మెట్టు వెంకటి, దమ్మపేటకు చెందిన విజయ, ఇల్లెందు నుంచి బి.విజయ, టేకులపల్లికి చెందిన చంద్రకళ భూసమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. ఔట్ సోర్సింగ్ టెండర్లలో తమ సొసైటీకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చుంచుపల్లికి చెందిన బి రాజన్న, సమాచార హక్కు చట్టం కింద చేసిన దరఖాస్తుకు సంబంధించి వివరాలు ఇవ్వాలని ఇల్లెందు నుంచి బి. ప్రియాంక్ దరఖాస్తు చేశారు. ఆర్డీఓ మధు అందుబాటులో లేకపోవడంతో డీఏఓ వి.వి. శకుంతల దరఖాస్తులు స్వీకరించారు.

టిమ్ డ్రైవర్ల ఆందోళన

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఆర్టీసీ డిపో పరిధిలోని టిమ్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం రాత్రి నుంచి విధులు బహిష్కరించి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యలు పరిష్కరించాలని వారం క్రితం డిపో మేనేజర్ తిరుపతికి వినతిపత్రం అందజేశామని, అయినా ఎలాంటి స్పందన లేకపోవడంతో ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని అన్నారు. డిపోలో 90 మంది టిమ్ డ్రైవర్లు ఉన్నామని, ఇటీవల తమపై పనిభారం పెరిగి మానసిక ఒత్తిడికి గురవుతున్నామని వాపోయారు. బస్సులో టికెట్లు ఇవ్వడం, కార్గో సేవలు చూడడం, రిజర్వేషన్ చెక్ చేసుకోవడం, రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు ఫోన్లు చేసి విసిగించడం వంటివి భారంగా మారుతోందన్నారు. తాము నడిపే బస్సులకు కండక్టర్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరారు.

కేవీకేకు రెండు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న భరత్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇటీవల తమిళనాడులో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రానికి రెండు పురస్కారాలు లభించాయి. తేనెటీగల పెంపకంలో యువ రైతులను ప్రోత్సహించడం, ఉత్తమ వార్షిక కార్యక్రమాలకు గాను ఈ అవార్డులు అందుకున్నామని కేవీకే ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ టి.భరత్ తెలిపారు. ఈ పురస్కారాలు తమ బాధ్యతను మరింతగా పెంచాయన్నారు. సహకరించిన శాస్త్రవేత్తలు, రైతులకు కృతజ్ఞతలు తెలిపారు.

వసతి గృహానికి శంకుస్థాపన..

కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం వసతిగృహ నిర్మాణానికి తెలంగాణ మండల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వరంగల్ హెచ్‌ఓడీ డాక్టర్ ఆర్.ఉమారెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వివిధ శిక్షణ, నైపుణ్య కార్యక్రమాలు ఇక్కడ నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్, శాస్త్రవేత్తలు నీలం హేమశరత్‌చంద్ర, బి.శివ పాల్గొన్నారు.

పోషకాలు అందేదెలా?

- ప్రభుత్వ పాఠశాలల్లో అమలుకు నోచని రాగిజావ పంపిణీ
- అదనపు భారమంటూ ముందుకురాని భోజన కార్మికులు
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం
- పలు స్కూళ్లలో కోడిగుడ్డు కూడా వడ్డించని వైనం



జిల్లాలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ(ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందించే వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలు వారి శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు మరింతగా ప్రయోజనం చేకూరుతుంది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 1 నుంచి రాగి జావ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ జిల్లా, మండల, కాంప్లెక్స్ విద్యాధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో జిల్లాలో ఎక్కడా ఈ పథకం ఇంతవరకూ అమలు కాలేదు.

స్నాక్స్‌పైనా కొరవడిన స్పష్టత..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. ఈ తరగతులు ప్రారంభిస్తే విద్యార్థులకు రెండు పూటలా స్నాక్స్ అందించాలి. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.15 చొప్పున కేటాయిస్తామని, వాటితో పల్లిపట్టి, అరటిపండ్లు, బిస్కట్లతో పాటు విద్యార్థులకు అదనపు శక్తినిచ్చే అల్పాహారం అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ ఇంతవరకూ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులకు స్నాక్స్ అందించడం ఎలా అని ప్రధానోపాధ్యాయులు ఆలోచనలో పడ్డారు. స్నాక్స్ అందించేందుకు ఎవరైనా దాతలు ముందుకొస్తారా అని ప్రయత్నాలు చేస్తున్నారు.

భారమవుతున్న గుడ్డు..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు అందించాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఒక్కో గుడ్డుకు రూ.6 చొప్పున భోజన కార్మికులకు అందిస్తుండగా.. మార్కెట్‌లో ప్రస్తుతం గుడ్డు ధర రూ.7, కొన్నిచోట్ల రూ.8 కూడా ఉంది. దీంతో తమపై భారం పడుతోందంటూ కార్మికులు విద్యార్థులకు సక్రమంగా కోడిగుడ్డు వడ్డించడం లేదు. కొన్ని పాఠశాలల్లో మాత్రం హెచ్‌ఎంలు బలవంతంతో అందిస్తున్నారు. ఇక గత ప్రభుత్వ హయాంలో మండలానికి ఒక పాఠశాలను ఎంపిక చేసి విద్యార్థులకు ఉదయం అల్పాహారం కింద రోజుకో రకమైన టిఫిన్ పెట్టేవారు. క్రమంగా అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని నిర్ణయించారు. కానీ ఎన్నికల తర్వాత ఆ పథకం కూడా నిలిచిపోయింది. ఇలా విద్యార్థులకు అందాల్సిన అన్ని రకాల పోషకాహారాలు నిలిచిపోతుండడంతో వారి ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాగిజావ అమలుపై డీఈఓ నాగలక్ష్మిని వివరణ కోరగా, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఒక ట్రస్ట్‌కు ఈ బాధ్యత అప్పగించిందని, ప్రస్తుతం వారు సిద్ధంగా ఉన్నందున వారం రోజుల్లో జిల్లాలో ప్రారంభిస్తామని చెప్పారు.

బీఆర్‌ఎస్ హయాంలో అమలు..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి ఒక గంట ముందు విద్యార్థులకు బెల్లంతో కాచిన రాగిజావ అందించేవారు. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఈ పథకం నిలిచిపోయింది. కాగా, సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సర్కారు స్కూళ్లలో రాగిజావ అందించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొన్ని జిల్లాల్లో ఈ పథకం ఇటీవల ప్రారంభమైనా.. ఇక్కడ మాత్రం ఇంకా అమలుకు నోచుకోలేదు. అయితే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారుచేసే కార్మికులు.. రాగిజావ కాచడం తమకు అదనపు పని అని, ఒక్కో విద్యార్థికి రూ.2 చొప్పున అదనంగా చెల్లిస్తే సిద్ధమని ముందుగానే ప్రకటించారు. జావ తయారీకి అవసరమైన వంట గ్యాస్ కూడా ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వం మాత్రం ఒక్కో విద్యార్థికి అదనంగా 25 పైసలు(పావలా) మాత్రమే చెల్లిస్తామని ప్రకటించింది. దీంతో రాగి జావ కాయడం కుదరదని భోజన కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

తప్పని యూరియా తిప్పలు

- తెల్లవారకముందే బారులుదీరుతున్న అన్నదాతలు
- సత్యనారాయణపురంలో సొమ్మసిల్లిన రైతు



సుజాతనగర్ పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు

సుజాతనగర్/అశ్వాపురం/చర్ల/టేకులపల్లి : జిల్లాలో యూరియా కోసం రైతుల కష్టాలు తప్పడం లేదు. విక్రయ కేంద్రాల వద్ద తెల్లవారకముందే బారులు దీరుతున్నారు. ఎక్కువ సేపు క్యూలో నిల్చోలేక చెప్పులు, పట్టాదారు పాస్ పుస్తకాలను వరుసక్రమంలో పెట్టి చెట్ల కింద సేద తీరుతున్నారు. చర్ల మండలం సత్యనారాయణపురం పీఏసీఎస్ వద్ద గంటల తరబడి క్యూలో నిల్చున్న ఓ గిరిజన రైతుకు మూర్ఛ రాగా సొమ్మసిల్లి పడిపోయాడు. తిప్పాపురం గ్రామానికి చెందిన వృద్ధ రైతు కారం సోమయ్య.. తనకు ఇచ్చిన కూపన్‌తో క్యూలో నిల్చోగా ఒత్తిడి పెరగడంతో సొమ్మసిల్లగా అధికారులు, సిబ్బంది వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అశ్వాపురం మండలం మొండికుంట పీఏసీఎస్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయమే భారీగా క్యూ కట్టారు. ఏఓ మహేష్‌చంద్ర చటర్జీ అక్కడికి చేరుకుని ఉన్న నిల్వలను రైతులందరికీ సమానంగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టారు. సుజాతనగర్ సొసైటీ కార్యాలయంలో యూరియా నిల్వలు లేకపోయినా ఆధార్ కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలను క్యూలో పెట్టి రైతులు వేచి చూశారు. వారం, పది రోజులుగా తిండీ, తిప్పలు మానుకొని తిరుగుతున్నామని, బస్తా యూరియా కోసం అరిగోస పడుతున్నామని రైతులు వాపోయారు. టేకులపల్లిలోనూ గంటల తరబడి క్యూలైన్లో నిల్చునా బస్తా యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సొసైటీ కార్యాలయం తెరవకముందే అక్కడికి చేరుకుని చెప్పులు లైన్‌లో పెట్టి చెట్టుకింద కూర్చున్నారు. దీంతో సిబ్బంది ఉదయం 7 గంటలకే తాళాలు తీసి యూరియా పంపిణీని ప్రారంభించారు. ఎకరం ఉన్న వారికి ఒకటి, అంతకంటే ఎక్కువ ఉన్నవారికి రెండు బస్తాలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఏఓ నీరుడు అన్నపూర్ణ తెలిపారు.



చర్ల : యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లి పడిన రైతు

కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు రెండు వారాలు గడువు ఇస్తూ, విచారణ వాయిదా వేసింది. తెలంగాణ మున్సిపాలిటీల (సవరణ) చట్టం–2025 సవరణ, ఆ తర్వాత కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటును సవాల్ చేస్తూ జె.శివరామ్‌ప్రసాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఇదే అంశంపై మరో పిల్ కూడా దాఖలైంది. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీలు, పాల్వంచ సంస్థాన్ గ్రామాలు, సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఈ మేరకు మే 29న జీఓ 103ను జారీ చేశారని చెప్పారు. ఈ జీఓ తెలంగాణ మునిసిపాలిటీల చట్టం, ఏజెన్సీ ప్రాంతాలను నియంత్రించే నిబంధనలకు విరుద్ధమని వాదించారు. చట్టం ప్రకారం.. విలీనమైన ప్రాంతాలు భౌగోళికంగా ఒకదానికొకటి దగ్గరగా లేవన్నారు. రిజర్వ్ ఫారెస్ట్, లక్ష్మీదేవిపల్లి ఏజెన్సీ.. పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలను వేరు చేశాయని నివేదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ల అభ్యంతరాలపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేసింది.

క్లుప్తంగా

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలోని జ్యోతిబాపూలే గురుకులం విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఖమ్మం జిల్లా బోనకల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఎంపికల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులు శ్రీహరి, ఎం.రఘురాం, ధనుష్, కే.వినయ్, ఎం.చరణ్, ఐ.జానకీరాంలను ప్రిన్స్‌పాల్ ఎస్కే బురాన్, ఏటీపీ శ్రీకాంత్, డిప్యూటీ వార్డెన్ మధు, పీడీ డాక్టర్ రఘువరన్, ఇతర అధ్యాపకులు సోమవారం అభినందించారు.

రేపు వాహనాల వేలం

పాల్వంచ: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 10న వేలం వేయనున్నట్లు పాల్వంచ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ ఎం.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆటో, ద్విచక్ర వాహనాలకు వేలం వేస్తామని, ఆసక్తి కలిగినవారు ఉదయం 10.30 గంటలకు ఎక్సైజ్ స్టేషన్‌లో హాజరు కావాలని కోరారు.

రెండు ఇళ్లల్లో చోరీలు

చంద్రుగొండ: మండలంలోని తిప్పనపల్లి, మద్దుకూరు గ్రామాల్లో ఆదివారం రాత్రి రెండు ఇళ్లల్లో చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. తిప్పనపల్లి గ్రామానికి చెందిన ప్రైవేటు వైద్యుడు ఎస్కే బషీర్ ఈ నెల 6న భార్యతో కలిసి ఖమ్మంలో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లాడు. తలుపు పగులగొట్టి ఉండటంతో పక్కింటివారు గమనించి సమాచారం ఇచ్చారు. సోమవారం వచ్చి చూడగా బీరువాలో ఉంచిన బంగారం, రూ. 12 వేలు నగదు చోరీకి గురైంది. మద్దుకూరు గ్రామానికి చెందిన చాపల వసంత ఆదివారం రాత్రి ఇంటి ముందు ఆలయంలో నిద్రపోయింది. సోమవారం ఉదయం ఇంటికి చేరుకుని పరిశీలించగా బీరువాలో రూ. లక్ష నగదు చోరీకి గురైంది. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

రెక్కీ చేసి.. సొత్తు ఎత్తుకెళ్తూ..

- అంతర్ జిల్లాల దొంగలు అరెస్ట్
- రూ.16లక్షల విలువైన సొత్తు స్వాధీనం



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రమణమూర్తి

ఖమ్మంక్రైం: ఖమ్మం జిల్లాలో వివిధ ప్రాంతాలతోపా టు ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, అర్బన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వివరాలను సోమవారం నగర ఏసీపీ రమణమూర్తి వెల్ల డించారు. ఖమ్మం ముస్తఫానగర్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ చోరీలకు పాల్పడుతున్న పాతనేరసుప్తుడు చల్లా వెంకటేశ్వర్లు, భద్రాచలం శ్రీరామ్‌నగర్‌కు చెందిన దేవనబోయిన మహేష్ అలియాస్ బాతు పలు ప్రాంతాల్లో తిరుగుతూ తాళాలు వేసి ఇళ్లను గుర్తించేవారు. ఆపై రాత్రివేళ చోరీ చేసి ఆ డబ్బుతో మూడు ద్విచక్రవాహనాలు కొనుగోలు చేశారు. వీటిపై తిరుగుతూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఖమ్మం నగరంతోపాటు, ఖమ్మం రూరల్, బోనకల్, కామేపల్లి, వేంసూరు, ఏన్కూరు, సత్తుపల్లి, కొత్తగూడెం ప్రాంతాల్లో చోరీ చేయగా, చల్లా వెంకటేశ్వర్లుపై గతంలోనే 15చోరీ కేసులు ఉన్నాయి. జైలు నుంచి విడుదలైనా తీరు మారకపోగా బట్టల షాపులో పనిచేసే మహేష్‌తో కలిసి చోరీలు మొదలుపెట్టాడు. ఖమ్మం నూతన బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న వీరిని అదుపులోకి తీసుకోవడం చోరీల విషయం బయటపడింది. దీంతో నిందితుల నుంచి రూ.13లక్షల విలువైన 127గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండితో పాటు టీవీ, సౌండ్‌బాక్స్, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు.

తప్పుడు సమాచారంతో ఇక్కట్లు

సొత్తు పోగొట్టుకున్న వారిలో కొందరు అబద్ధపు వివరాలతో ఫిర్యాదు చేస్తున్నారని ఏసీపీ రమణమూర్తి తెలిపారు. రెండు తులాల ఆభరణాలు పది తులాలని, రోల్డ్‌గోల్డ్ నగలు పోతే నిజమైన నగలుగా ఫిర్యాదు చేస్తుండడంతో రికవరీలో ఇబ్బంది అవుతోందని పేర్కొన్నారు. కాగా, చోరీ అయిన సమయాన ఫిర్యాదు చేసేవారు బిల్లులు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, అపార్ట్‌మెంట్లలో చోరీచేసిన మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ ముఠాను గుర్తించామని చెప్పారు. కొన్ని అపార్ట్‌మెంట్లలో వాచ్‌మెన్లు లేకపోగా, ఉన్నచోట మద్యం సేవించి నిద్రిస్తుండడంతో దొంగలకు పని సులువవుతోందని తెలిపారు.ఈ సమావేశంలో సీసీఎస్ ఏసీపీ సర్వర్, సీఐలు కరుణాకర్, బాలకృష్ణ, భానుప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ఎదురుచూపులు

- కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదు నెలలుగా అందని కమీషన్
- అమలుకు నోచుకోని గౌరవ వేతనం, కమీషన్ పెంపు



బాలాజీనగర్‌లో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

ఇల్లెందురూరల్: రేషన్ డీలర్లకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఐదునెలలుగా కమీషన్ అందడంలేదు. దీంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలో 442 రేషన్‌షాపులు ఉన్నాయి. ప్రతినెలా 3,17,273 రేషన్‌కార్డులకు డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. క్వింటా బియ్యం పంపిణీకి డీలర్లకు రూ.140 చొప్పున కమీషన్ చెల్లిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీ చేపట్టింది. జూన్‌లో మూడు నెలల కోటాను ఒకేసారి పంపిణీ చేసింది. సన్నబియ్యం పంపిణీ ప్రారంభించిన నాటి నుంచి డీలర్లకు కమీషన్ చెల్లింపు నిలిచిపోయింది. కమీషన్ డబ్బులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఆచరణలో అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన కమీషన్‌ను ఇటీవలే విడుదల చేసింది. ఐదు నెలల కమీషన్ రూ.69,98,015.5లను డీలర్లలో అకౌంట్లో జమ చేసింది. కానీ కేంద్ర ప్రభుత్వం కమీషన్ చెల్లించకుండా జాప్యం చేస్తోంది. ఐదు నెలలకు సంబంధించి రూ. 3,49,90,077.5 కమీషన్ పెండింగ్‌లో ఉంది. దీంతో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. షాపు అద్దె, గుమస్తా జీతం అప్పులు చేసి చెల్లించాల్సివస్తోంది. దీనికితోడు బియ్యం దిగుమతి ఖర్చులు కూడా డీలర్లే భరిస్తున్నారు. ఐదు నెలలుగా కమీషన్ చెల్లింపు నిలిచిపోవడంతో రేషన్ డీలర్లకు దుకాణాల నిర్వహణ భారంగా మారింది.

అమలుకాని హామీలు

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో క్వింటాకు కమీషన్ రూ.300, గౌరవ వేతనం నెలకు రూ.5 వేలు చొప్పున చెల్లిస్తామని కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చినా ఇప్పటివరకు హామీలు అమలు చేయడంలేదు. కమీషన్ సక్రమంగా చెల్లించాలని, హామీలు అమలు చేయాలని కోరుతూ రేషన్‌డీలర్లు జిల్లా వ్యాప్తంగా నిరసన బాట పట్టారు. తహసీల్దార్ కార్యాలయాల్లో డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ నెల 6న రేషన్ దుకాణాలను ఒక రోజు బంద్ చేసి నిరసన తెలిపారు.

ప్రతి నెలా జిల్లాలో పంపిణీ చేసే రేషన్ బియ్యం వివరాలు (క్వింటాళ్లలో)

జిల్లాకు వచ్చే బియ్యం :	59,982.99
కేంద్రం కోటా:	49,985.825
రాష్ట్ర ప్రభుత్వం కోటా :	9,997.165

డీలర్లకు చెల్లించే కమీషన్ (రూ.లలో)

మొత్తం కమీషన్ :	రూ.83,97,618.6
కేంద్రం వాటా:	రూ.69,98,015
ఐదు నెలల పెండింగ్ కమీషన్ :	రూ. 3,49,90,077.5
రాష్ట్ర ప్రభుత్వ వాటా :	రూ.13,99,603.1
ఇటీవల చెల్లించిన ఐదు నెలల కమీషన్ :	రూ.69,98,015.5

పెండింగ్ కమీషన్ చెల్లించాలి



ఐదు నెలలుగా కేంద్ర ప్రభుత్వం కమీషన్ చెల్లించకపోవడంతో రేషన్ షాపుల నిర్వహణ భారంగా మారింది. షాపు నిర్వహణ, కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోంది. కేంద్రం పెండింగ్ కమీషన్ విడుదల చేయాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి.

–ఊకే శేఖర్‌రావు, రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు

రైతులకు యూరియా సరఫరా చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పంటలకు అవసరమైన యూరియా సరఫరా చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత నవభారత్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ కన్వీనర్ కెచ్చెల రంగారెడ్డి, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ అధిక వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పోడు భూముల్లో పంటలు తొలగించిన అటవీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పత్తికి కనీస మద్దతు ధర రూ.10,075 చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుర్రా వెంకన్న, కల్లూరి కిషోర్, మాచర్ల సత్యం, భానోత్ ధర్మ, జి.వెంకటేశ్వర్లు, పి.వీరబాబు, ఎన్ నాగేశ్వరరావు, ఆర్ వెంకటేశ్వర్లు, నూపా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'పోడు'పై దాడులు చేయొద్దని..

సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పోడుసాగుదారులపై అటవీశాఖాధికారులు చేస్తున్న దౌర్జన్యాలు, దాడులకు స్వస్తి పలకాలని కోరుతూ సీపీఐ, బీకేఎంయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, వలస ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని నినదించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా మాట్లాడుతూ అనాదిగాసాగు చేసుకుంటున్న పోడు భూముల్లో అధికారులు కందకాలు తవ్వి, సాగులో ఉన్న పంటలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకంలో 200 పనిదినాలు కల్పించాలని, కూలి రూ. 700 చెల్లించాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, రేసు ఎల్లయ్య, నాయకులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, నరాటి ప్రసాద్, ఎస్‌డీ సలీం, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, ముద్వా వెంకటేశ్వరరావు, బి నాగయ్య, ఎండీ యూసుఫ్, పి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉమ్మడిగా సర్వే నిర్వహిస్తాం

కొత్తగూడెం ఆర్డీఓ మధు



గిరిజనుల ఆధారాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ మధు, ఇతర అధికారులు

అశ్వారావుపేటరూరల్: గత కొన్నేళ్లుగా వివాదం నెలకొన్న ఫారెస్టు, రెవెన్యూ భూములపై త్వరలోనే ఉమ్మడి సర్వే చేపడతామని కొత్తగూడెం ఆర్డీఓ మధు తెలిపారు. మండలంలోని రామన్నగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 30,36,39 లోగల భూములపై రెవెన్యూ, అటవీ కార్పొరేషన్ అధికారులు, గ్రామస్తులతో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం సమావేశం నిర్వహించారు. భూములకు సంబంధించి గిరిజనుల వద్ద ఉన్న పూర్వ పట్టాదారు పాసు పుస్తకాలు, ఇతర పత్రాలు, ఫారెస్టు, రెవెన్యూ రికార్డులు, మ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం భూ వివాదాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఉమ్మడి సర్వే చేస్తామని తెలిపారు. ఇందుకు గిరిజనులు కూడా అంగీకరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీవో దామోదర్ రెడ్డి, సత్తుపల్లి, కొత్తగూడెం ఎఫ్‌డీసీ డీఎంలు గణేష్, చంద్రమోహన్, తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ, సత్తుపల్లి జోన్-1 ప్లాంట్ మేనేజర్ బ్రహ్మాచారి, ప్లాంట్ మేనేజర్ చంద్రకళ, సీఐ నాగరాజు, ట్రైనీ ఎస్సై అఖిల పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ



పరస్పరం దాడులు చేసుకుంటున్న ఇరువర్గాలు

17 మందిపై కేసు నమోదు

మణుగూరు టౌన్: భూ వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. పరస్పరం దాడులు చేసుకుని ఫిర్యాదులు చేసుకోవడంతో సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లంపాడులోని తాటికుంట చెరువు సమీపంలో చల్లా పెద్ద రాములుకు 14 ఎకరాలు ఉండగా, 5.10 ఎకరాల పట్టా భూమి చల్లా ఆయన పేరుతోనే ఉందని ఒక వర్గానికి చెందిన చల్లా సుమతి తెలిపారు. 8.30 ఎకరాల గెట్టు భూమి అన్నదమ్ముల పేరిట ఉందని, 2016లో పెద్ద రాములు మృతి చెందాడని పేర్కొన్నారు. పెద్ద రాములు బతికి ఉన్న సమయంలో కౌలుకు తీసుకున్న వ్యక్తులు ఇప్పుడు ఆ భూమి తమదేనని అంటున్నారని వాపోయారు. ఈ విషయమై తహసీల్దార్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని సర్వే చేస్తుండగా కొందరు అడ్డుకుని దాడులు చేశారని తెలిపారు. సదరు భూమిని ప్రస్తుతం మణుగూరు ఓసీ విస్తరణలో సింగరేణి తీసుకుంటోందని పేర్కొన్నారు. కాగా ఆ భూమిని తాము 22 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామని మరో వర్గానికి చెందిన తమ్మిశెట్టి వెంకటనర్సు కుటుంబ సభ్యులు తెలిపారు. శిస్తు కట్టడంతోపాటు, సొసైటీకి ధాన్యం విక్రయించిన ఆధారాలున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో సర్వే చేస్తుండగా కొందరు వ్యక్తులు అడ్డగించి దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. కాగా ఘర్షణలో ఇరువర్గాలకు చెందిన చల్లా నర్సయ్య, చల్లా తిరుపతిరావు, మౌనిక, మల్లేశ్‌లతో పాటు తమ్మిశెట్టి వెంకటనర్సు, కుటుంబ సభ్యులు మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు. బాధితులు మణుగూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై సీఐ నాగబాబును వివరణ కోరగా.. ఇరువర్గాల ఫిర్యాదులతో 17 మందిపై కేసులు నమోదు చేశామని తెలిపారు.

నేడు సురవరం సంస్మరణ సభ

సూపర్‌బజార్(కొత్తగూడెం): సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు ఉదయం 10 గంటలకు నిర్వహించే సంస్మరణ సభకు హాజరుకావాలని కోరారు.


రెండు తాచుపాముల పట్టివేత



పామును పట్టుకుంటున్న సంతోష్

కొత్తగూడెం అర్బన్: లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు గ్రామపంచాయతీకి చెందిన రజాక్ అనే వ్యక్తి ఇంట్లోకి సోమవా రం తాచు పాము వచ్చింది. ప్రాణధార ట్రస్ట్ అధ్యక్షుడు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. శ్రీనగర్ కాలనీ నాలుగో లైన్‌లో కూడా ఓ ఇంట్లోకి తాచుపాము రాగా సంతోష్ వెళ్లి పట్టుకున్నారు. అనంతరం రెండు పాములను అటవీప్రాంతంలో వదిలిపెట్టినట్లు తెలిపారు.

ఇంద్రధనస్సు కనువిందు



భద్రాచలంఅర్బన్: మబ్బులు కమ్మిన ఆకాశంలో విరిసిన ఇంద్రధనస్సు కనువిందు చేసింది. ఈ దృశ్యం సోమవారం సాయంత్రం భద్రాచలం పట్టణంలో కనిపించింది. ఆకాశం ఒక్కసారిగా మేఘావృతంగా మారి జల్లులు పడ్డాయి. మరోవైపు ఎండ కూడా ఉంది. ఈ క్రమంలో రంగు రంగుల ఇంద్రధనస్సు దర్శనమివ్వడంతో వీక్షకులు ఆసక్తిగా తిలకించారు.

'చేతబడి' అనుమానంతో ముగ్గురిపై దాడి

- బాధితులపై మూత్రం పోసిన వైనం
- దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు



ఆవేదన వ్యక్తం చేస్తున్న బాధితులు

అశ్వారావుపేటరూరల్: చేతబడి, క్షుద్ర పూజలు చేస్తున్నారనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన పాయం వెంకటేశ్వరరావు, మడకం రంగయ్య, దేరంగుల దయాకర్‌తోపాటు మరో మహిళ కలిసి గ్రామ శివారులోని వంతెన వద్ద పసుపు, కుంకుమతో పూజలు చేసి చేతబడి చేస్తున్నట్లు అనుమానంతో అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కలిసి శుక్రవారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. కాగా, గ్రామస్తులు రావడాన్ని గమనించిన మహిళ అక్కడి నుంచి పారిపోగా, పాయం వెంకటేశ్వరరావు, మడకం రంగయ్య, దయాకర్‌పై దాడికి పాల్పడ్డారు. బాధితులపై మూత్రం పోసి చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు. దాడిలో వెంకటేశ్వరరావు చేయి విరిగిపోగా, రంగయ్య, దయాకర్‌లు స్వల్పంగా గాయపడ్డారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందిన బాధితులు సోమవారం పోలీసులకు పిర్యాదు చేశారు. దీంతో దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని, మిగిలినవారి వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్సై అఖిల తెలిపారు.

ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీ

ఐదుగురికి స్వల్ప గాయాలు



రోడ్డు ప్రమాదంతో ప్రధాన రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై సోమవారం ఆర్టీసీ బస్సు, ట్రాక్టర్ ఢీకొన్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. మణుగూరు డిపోకు చెందిన బస్సు ఖమ్మం వెళ్తుండగా ఇటుక లోడ్‌తో ట్రాక్టర్ మణుగూరు వైపు వెళ్తోంది. ఈ క్రమంలో మిట్టగూడెం వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ట్రాక్టర్ బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సు అదుపు తప్పి రోడ్డు దిగి గుంతలోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వడ్డె రాజయ్య, కండక్టర్ జిల్లేపల్లి రవీంద్రచారితో పాటు ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్రమబద్ధీకరించారు. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా బస్సు కండక్టర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

మొర్రేడులో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి



సురేష్ మృతదేహం

పాల్వంచ: మొర్రేడు వాగు దాటుతుండగా వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వనమా బజార్‌కు చెందిన ఆటో డ్రైవర్ యాట సురేష్(35) ఆదివారం బంగారు జాలలో ఉండే అత్తగారింటికి వెళ్లేందుకు గుడిపాడు వద్ద మొర్రేడు వాగు దాటుతున్నాడు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండి నీళ్లలో కొట్టుకు పోయాడు. సాయంత్రం ఇంటికి రాక పోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు వెతుకగా మొర్రేడు వాగు బ్రిడ్జి వద్ద నీళ్లలో సురేష్ మృతదేహం లభించింది. మృతుడి భార్య దుర్గాభవాని ఫిర్యాదుతో ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డి మందుతాగిన వివాహిత మృతి

పాల్వంచరూరల్: గడ్డి మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామానికి చెందిన కొర్ర ఈరీ(42) కుటుంబ సభ్యుల మందలించారని మనస్తాపం చెంది ఈ నెల 6న ఇంట్లో పురుగుల మందు తాగింది. అపస్మారకస్థితిలోపడి ఉండగా కుటుంబ సభ్యులు గమనించి పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు, అనంతరం హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బూర్గంపాడు: పినపాక పట్టీనగర్ గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం .. పాల్వంచ వైపు నుంచి భద్రాచలం వైపు వస్తున్న ఓ మోటార్ సైకిల్‌ను ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న యువకుడికి, యువతికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా ప్రాంతానికి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. కాగా బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. ఎస్సై అఖిల కథనం ప్రకారం.. మున్సిపాలిటీ పరిధిలోని ఫైర్ కాలనీ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. రూ.1,850 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

63 కిలోల గంజాయి స్వాధీనం?

జూలూరుపాడు: నిషేధిత గంజాయిని అక్రమంగా ఓ వాహనంలో తరలిస్తుండగా సోమవారం జూలూరుపాడు పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. మండలంలోని మాచినేనిపేటతండా గ్రామ శివారులో జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి, పోలీస్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేస్తుండగా కొత్తగూడెం వైపు నుంచి హైదరాబాద్ వెళుతున్న బొలెరో వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌తోపాటు, మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఇద్దరి నుంచి సుమారు 63 కిలోల గంజాయి ప్యాకెట్లు పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన ఇసుక లారీ

దమ్మపేట: అనుమతులు లేకుండా ఆంధ్రా నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పోలీసులు సోమవారం సీజ్ చేశారు. మండలంలోని ముష్టిబండ గ్రామ శివారులో లారీని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.